క్లుప్తంగా

ఆర్ఐటీఐలో ప్రవేశాలకు 3,4 తేదీల్లో కౌన్సెలింగ్

చింతపల్లి: స్థానిక ఆర్ఐటీఐలో ప్రవేశాలకు రెండు రోజులుపాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పిన్సిపాల్ రాజారావు తెలిపారు.ఐటీఐలో వివిధ ట్రేడ్‌ల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సంబంధించి గత నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. 3వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఇంతకు ముందు ప్రకటించామని తెలిపారు. 4 తేదీన కూడా కౌన్సెలింగ్ జరుపుతామని చెప్పారు. 3వ తేదీన హాజరు కాలేని విద్యార్థులు 4వ తేదీన కౌన్సెలింగ్‌కి హాజరు కావచ్చని ఆయన తెలిపారు.

అరకులోయలో వాయిదా

అరకులోయ రూరల్: స్థానికప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో మిగులు సీట్ల భర్తీకి నిర్వహించవలసిన కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈనెల 3న నిర్వహించవలసిన రెండో విడత కౌన్సెలింగ్ మన్యం బంద్ కారణంగా 4వ తేదీన నిర్వహించనున్నట్టు తెలిపారు.

ముమ్మరంగా ఓటర్ల సర్వే



సర్వే చేస్తున్న బూత్ స్థాయి అధికారులు

డుంబ్రిగుడ: మండల వ్యాప్తంగా ఓటర్ల సర్వేను ముమ్మరం చేశారు. సొవ్వ, కితలంగి,గసభ పంచాయతీల్లో మంగళవారం సర్వే జరిపారు. ఈ నెల 25 తేదీలోపు సర్వేను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో సర్వేను వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు సంజీవరావు, అప్పారావు, అనంత్‌రావు, ప్రసాద్ ,రాములమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పోలీసులు

రాజవొమ్మంగి: తమ దత్తత గ్రామం బోర్నగూడెం బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో పది పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు జడ్డంగి పోలీసులు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో యాట్ల నిఖిల్‌రెడ్డి, ముర్ల చరణ్‌కుమార్, దుంపా సన్నిబాబులు పదవ తరగతి పరీక్షల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. వీరికి ఎస్ఐ రఘునాథరావు నిఘంటువులు, జ్ఞాపికలు అందజేశారు. జడ్డంగి కానిస్టేబుల్ రత్నకుమార్ సహకారంతో ఈ బహుమతులు అందజేసినట్టు హెచ్ఎం ఎఱ్రాశాస్త్రి తెలిపారు.

గురుకులంలో 'కండ్ల కలక'లం



గురుకుల పాఠశాల విద్యార్థులను పరీక్షిస్తున్న సూపరింటెండెంట్ సతీష్

అడ్డతీగల: స్థానిక గురుకుల పాఠశాలలో కండ్ల కలక వ్యాప్తి చెందింది. కండ్లకలకతో బాధపడుతూ ప్రతి రోజు విద్యార్థులు ఆస్పత్రికి వస్తుండడంతో వ్యాధి తీవ్రంగా వ్యాపిస్తున్నట్టు గుర్తించి పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించినట్టు అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.సతీష్ తెలిపారు.పాఠశాలలో 400 మంది విద్యార్థులుండగా 320 మందికి కండ్లకలక సోకినట్టు చెప్పారు. విద్యార్థులను పరీక్షించి, మందులు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



లబ్బూరు వైద్యాధికారి ప్రతాప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

ముంచంగిపుట్టు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా వర్కర్లు లబ్బూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. పనిభారం తగ్గించాలని,అధికారుల వేధింపులు ఆపాలని,ఆన్‌లైన్ పనులపై శిక్షణ ఇవ్వాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు, నేతలు ఎం.ఎం.శ్రీను, నాగేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ సుబ్బలక్ష్మి



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీరు నాగమణి



పాడేరు పాతబస్టాండ్ వద్ద వృద్ధురాలికి పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్

వై.రామవరం: పింఛన్ల పంపిణీ జోరుగా సాగుతోంది మండలంలో 90 శాతం పింఛన్ల పంపణీ పూర్తయినట్టు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మధుసూదనరాజు తెలిపారు. యార్లగడ్డ గ్రామంలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండల కేంద్రం వై.రామవరం గ్రామానికి చెందిన తస్కండ్ల అబ్బాయి అనే వృద్ధుడు పక్క గ్రామంలో తన కుమార్తె ఇంటివద్ద అనారోగ్యంతో ఉన్నారు. గ్రామ వలంటీరు గొర్లె నాగమణి, గృహసారథి బత్తుల యోగేంద్రం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆగ్రామానికి వెళ్లి పింఛన్ అందజేశారు. వారికి అబ్బాయి కృతజ్ఞతలు తెలిపారు.

జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

ముంచంగిపుట్టు: జోరుగా వర్షం పడుతున్నా మంగళవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్ పంపిణీ చేశారు. కొంత మంది వృద్ధులు, వితంతువులు పొలం పనులకు వెళ్లి పోవడంతో వలంటీర్లు పొలాలు, కొండ ప్రాంతాల వద్దకు వెళ్లి పింఛన్ బట్వాడా చేశారు.

అధిక ధరలకు ఎరువుల అమ్మకం

విక్రయాలు నిలిపివేసిన ఏవో



రైతులతో కలసి విచారణ చేస్తున్న ఏవో శ్రీనివాసరావు

చింతూరు: స్థానిక గ్రోమోర్ ఎరువుల దుకాణంలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారంటూ రైతులు చేసిన ఫిర్యాదు మేరకు తాత్కాలికంగా అమ్మకాలను నిలిపి వేసినట్టు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చొలూరుకు చెందిన కొంతమంది గిరిజన రైతులు మంగళవారం గ్రోమోర్ ఎరువుల దుకాణంలో డీఏపీ బస్తాలను కొనుగోలు చేసేందుకు వచ్చారు. డీఏపీ బస్తాలు ఉన్నా లేవనిచెప్పి తమకు వేరే ఎరువుల బస్తాలను అంటగట్టినట్టు రైతులు ఫిర్యాదు చేశారు. రూ. 735 గాను రూ.900 తీసుకున్నారని, బిల్లు కూడా ఇవ్వలేదని వారు ఏవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏవో శ్రీనివాసరావు ఎరువుల దుకాణానికి వెళ్లి వివరాలు సేకరించారు. రైతులకు అంటగట్టిన వేరే ఎరువుల బస్తాల స్థానంలో డీఏపీ బస్తాలను ఇప్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత దుకాణంలో తాత్కాలికంగా విక్రయాలు నిలిపి వేశామని ఏవో తెలిపారు.

ముంపు బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ



కన్నాయిగూడెంలో బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

ఎటపాక: గోదావరి వరద ముంపు బాధితులకు మంగళవారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు.కుసుమనపల్లి,తోటపల్లిలో బాధితులకు సర్పంచ్ దుర్గాలక్ష్మి, కన్నాయిగూడెంలో సర్పంచ్ పెనుబల్లి నాగమణి,ఎంపీటీసీ వర్సా బాలకృష్ణ బియ్యం ,అయిల్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కన్వీనర్లు గొల్లపల్లి శివబాబు,మోసం కన్న,వార్డు మెంబర్ కృష్ణవేణి,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సీఐ అశోక్‌కుమార్

గూడెంకొత్తవీధి: గిరిజనులు గంజాయి సాగు మానుకుని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సీఐ అశోక్‌కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా గంజాయి పంటను నాశనం చేసిన వారికి మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. చిన అగ్రహారం , వాడమామిడి, పెదగ్రహారం,నిమ్మపాడు గ్రామాలకు చెందిన గిరిజనులకు 365 ఎకరాల్లో వేసేందుకు స్వీట్ ఆరెంజ్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాము రాయి,కోతిగొంది గ్రామాల్లో కూడా పంపిణీ చేసినట్టు తెలిపారు.మొత్తం 1,045 ఎకరాలకు అవసరమైన మొక్కలను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి, ఏపీవో రాంప్రసాద్,మహిళా పోలీసు శాంతి పాల్గొన్నారు.

గంజాయి, రంగురాళ్ల జోలికి పోవద్దు



బెన్నవరంలో యువకులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరమణ

చింతపల్లి: గంజాయి సాగు,రంగురాళ్ల తవ్వకాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అన్నవరం ఎస్ఐ వెంకటరమణ సూచించారు. మండలంలోని బెన్నవరంలో సర్పంచ్ బొజ్జన్నదొరతో కలసి గిరిజన యువకులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి రవాణా చేసిన వారితో పాటు సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

ఆశ కార్యకర్తల సమావేశంలో డీఎంవో వరహాలుదొర



మాట్లాడుతున్న డీఎంవో వరహాలుదొర

మాడుగుల రూరల్: వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి కె. వరహాలుదొర తెలిపారు. ఆశ దినోత్సవాన్ని పురస్కరించుకుని కె.జె.పురం పీహెచ్‌సీలో మంగళవారం ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మలేరియా ఇంటింటి సర్వేను నిర్వహించి, వివరాలు అప్‌లోడింగ్ చేయాలని సూచించారు. ఇప్పటికే రెండు సార్లు దోమలు మందును గ్రామాల్లో పిచికారీ చేయించామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే, ఫ్రైడేను పురస్కరించుకొని ఇంటింటికి వెళ్లి దోమలు నివారణలో భాగంగా కొబ్బరిబొండాలు, రుబ్బురాళ్లలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో మైదాన, గిరిజన గ్రామాల్లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు ప్రబలవన్నారు. వైద్యాధికారి కె. లీలాప్రసాదు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ఐదో విడత మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమం గురించి సమావేశంలో సమీక్షించారు. మలేరియా, వ్యాధులు, వాటి నివారణ గురించి గేయాల రూపంలో సీహెచ్‌వో సిహెచ్. పుష్పమ్మ ఆలపించారు. కార్యక్రమంలో హెచ్‌వీ పుష్పకాంతం, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

వేడినీరు మీదపడి బాలుడికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన నాగరాజు

చింతూరు: వీఆర్‌పురం మండలం కొక్కిరిగూడెంకు చెందిన మడివి నాగరాజు అనే బాలుడి శరీరంపై వేడినీళ్లు పడడంతో తీవ్రగాయాలయ్యాయి. సోమవారం పొయ్యిపై కాస్తున్న వేడినీళ్లు ప్రమాదవశాత్తు నాగరాజుపై పడినట్టు బాలుడి తల్లిదండ్రులు ప్రసాద్, జయమ్మ తెలిపారు. ఈ ఘటనలో తమ కుమారుడి ముఖం, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. వరద వల్ల సోమవారం ఆస్పత్రికి తీసుకురాలేకపోయామని, మంగళవారం వరద తగ్గడంతో పడవ మీద సోకిలేరు వాగుదాటి బాలుడిని చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లినట్టు బాలుడితల్లిదండ్రులు తెలిపారు.

చురుగ్గా ఆరిల్లోవ రోడ్డు పనులు



రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

గొలుగొండ: కృష్ణదేవిపేట-నర్సీపట్నం ప్రధాన మార్గం ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేయడంతోపాటు అటవీ శాఖకు 5.20 ఎకరాల భూమి కేటాయించింది. ప్రస్తుతం 3.5 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా పనులు పూర్తి చేశారు. 24 అడుగుల రోడ్డు విస్తీర్ణం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. నెల రోజులపాటు రోడ్డు నాణ్యతగా ఉండేందుకు రోలర్‌తో పనులు నిర్వహించామని అధికారులు తెలిపారు. తర్వాత తారుపూతతో పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మిస్తామని అర్‌అండ్‌బీ జేఈ ప్రసాద్ తెలిపారు.

ఆలయాల్లో ఘనంగా పౌర్ణమి పూజలు



రామకోవెలలో వెలిగించిన దీపాలు

రాజవొమ్మంగి : మండలంలోని పలు ఆలయాల్లో మంగళవారం రాత్రి భక్తులు పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. దీపాలు వెలిగించి, భక్తి గీతాలు ఆలపించారు. స్థానిక శివాలయం, రామకోవెల, కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పున్నమి హారతులు ఇచ్చారు.

లంపీస్కిన్ నివారణ టీకా తప్పనిసరి



పశువైద్యాధికారి మంజూష

దేవరాపల్లి: ప్రతి ఆవుకు లంపీ స్కిన్ (ముద్ద చర్మ వ్యాధి) నివారణ టీకాను తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి కె.మంజూష అన్నారు. ఎం.అలమండ పశువైద్యశాలలో మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ టీకా కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ప్రమాదకర ఈ వ్యాధి తీవ్రత ఆవుల్లో అధికంగా ఉంటుందన్నారు. గతేడాది కొన్ని పశువుల్లో దీని లక్షణాలను గుర్తించామని, ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ముందస్తుగా ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. ఈ టీకాలు రైతు భరోసా కేంద్రాలతోపాటు పశు వైద్య కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు నిర్లక్ష్యం వహించకుండా ఆవులకు టీకా వేయించాలని కోరారు.

ముమ్మరంగా వరినాట్లు

మాకవరపాలెం: పల్లపు ప్రాంతాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో రైతులు ఎంతో ఉత్సాహంతో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఏటా ఖరీఫ్‌లో మండలంలో 1,200 హెక్టార్ల వరకు వరిసాగు అవుతోంది. ఈ నేపథ్యంలో పల్లపు గ్రామాలైన మల్లవరం, గిడుతూరు, తామరం, మాకవరపాలెం, జంగాలపల్లి, కొండలఅగ్రహారం, పి.పి.అగ్రహారం, రాచపల్లి ప్రాంతాల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.

89 మందికి వైద్య పరీక్షలు



పరీక్షిస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలను పాటించడం ముఖ్యమని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం పాచిలవానిపాలెంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని నిర్వహించారు. 89 మందికి ఓ.పి ద్వారా వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు జాగ్రత్తలను వివరించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, రమణ, ఏఎన్ ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి నాట్లు వేసే పద్ధతిపై రైతులకు అవగాహన



వరి నాట్లు వేసే పద్ధతిపై అవగాహన కల్పిస్తున్న టాటా ట్రస్ట్ ప్రతినిధులు

రాజవొమ్మంగి: వరి సాగులో వరుస నాట్లు వేసే పద్ధతిపై (లైన్ ఊడ్పు) విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ / టాటా ట్రస్ట్ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని గింజర్తి గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. టెక్నికల్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ ఆధునాతన పద్ధతుల్లో నాట్లు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. లైన్ ఊడ్పుల వల్ల గాలి వెలుతురు బాగా సోకి పంటపై చీడ పీడలు, ఇతర తెగుళ్ల బెడద బాగా తగ్గుతుందన్నారు. ఫీల్డ్ కోర్డినేటర్లు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు,జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలో భీరం, బొయితిలి పంచాయతీల్లో బొడ్డాపుట్టు, భీరం ,మద్దిగరువు, బొయితిలి గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను, బొడ్డాపుట్టు గ్రామం వద్ద వరదకు కొట్టుకుపోయిన కల్వర్టును ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నష్టంపై త్వరితగతిన నివేదికలను ప్రభుత్వానికి పంపి, సకాలంలో రైతులకు సహాయం అందేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, తహసీల్దార్ అప్పలస్వామిలను ఆమె కోరారు. పంట నష్టపోయిన గిరిజన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు,సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంజుబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీపీ శెట్టి నీలవేణి



మధ్యాహ్న భోజనపథకం అమలు తీరును పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ అప్పారావు

అనంతగిరి: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీపీ శెట్టి నీలవేణి తెలిపారు. మండలంలోని గుమ్మకోట గురుకుల పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ముందుగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో 500 మంది విద్యార్థులున్నారు. డార్మెటరీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. డార్మెటరీతో పాటు ప్రహరీ, క్రీడామైదానం, అదనపు బోరు సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ అశోక్, కో ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య,డీడీ కొండలరావు

చింతపల్లిరూరల్: ఉపాధ్యాయుల బోధన, వారు అందించిన సేవలు మాత్రమే విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలుపుతాయని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలో లోతుగెడ్డ పంచాయతీ కొలంబంద పాఠశాలను మంగళవారం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావుతో కలసి ఆయన సందర్శించారు. విద్యార్థుల నోట్,వర్క్‌బుక్స్‌ను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులు సోలబం సత్యనారాయణ,కాకరి చంద్రరావులను దుశ్శాలువాలతో సన్మానించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో వనపల ప్రసాద్,ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి,వార్డెన్ పసుపులేటి వినాయకరావు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని కోరుతూ ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నేతలు



కొయ్యూరులో ఆందోళన చేస్తున్న పాస్టర్లు

అడ్డతీగల: మణిపూర్‌లో జరుగుతున్న హింసను అరికట్టి, శాంతిని నెలకొల్పాలని కోరుతూ అడ్డతీగలలో మంగళవారం వివిధ సంఘాల నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు.క్రైస్తవ దైవసేవకులు,సీఐటీయూ నాయకులు,తాపీ మేస్త్రీలు,జట్టుకూలీల సంఘాల నేతలు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్న ఈ ర్యాలీ స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి మార్కెట్‌రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. అనంతరం తహసీల్దార్ తాతారావు, సీఐ వై.రాంబాబుకు వినతిపత్రాలు అందజేశారు.

క్రైస్తవ సంఘాల ర్యాలీ

కొయ్యూరు: మణిపూర్‌లో మైనార్టీలకు రక్షణ కల్పించాలని కోరుతూ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. రాజేంద్రపాలెం నుంచి కొయ్యూరు వరకు వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవులు ర్యాలీ జరిపారు.మణిపూర్‌లో మైనార్టీలుగా ఉన్న క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న వైద్యాధికారి మంజుభార్గవి

అనంతగిరి: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలను ఇవ్వాలని వైద్యాధికారి మంజుభార్గవి తెలిపారు. లంగుపర్తి పంచాయతీ కేంద్రంలో అమెరికన్ ఫౌండేషన్, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ సంజీవరావు, హెచ్‌వీ వెంకటలక్ష్మి, మాస్సీ మండల కో ఆర్డినేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు

దేవరాపల్లి: బాల్య వివాహాలను అరికట్టి ఆడబిడ్డలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు) ఏపీఎం ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం తెనుగుపూడిలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా రహదారి భద్రతా వారోత్సవాలు, బాల్య వివాహాలు, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లల్లో రక్త హీనతను నివారించాలని, ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పురుషులతో సమానంగా చదివించాలని నినాదాలు చేశారు. మైనర్ల డ్రైవింగ్ చట్ట రీత్యా నేరమని, వాహనం నడిపే వారికి లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. చిరుధాన్యాల సాగు చేయాలని ఎంపీడీవో సూచించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, మండల విద్యాశాఖ అధికారి పడాల్‌దాసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.